జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
గురువారం, మే 30, 2024 పేజీలు : 08

# ప్రజాసేవలో అధికారులు విఫలం కాకూడదు

## సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




కథలాపూర్, మే 29(ప్రజాజ్యోతి): ప్రజలకు సేవ చేయడంలో అధికారులు విఫలం కాకూడదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జవ్వాజి రేవతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొట్టమొదటిసారి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే హోదాలో హాజరైన ఆది శ్రీనివాస్ కు ప్రజాప్రతినిధులు పుషగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్

## పాఠశాలల్లో జూన్ 4లోగా

# పనులన్నీ పూర్తి కావాలి

- రాత్రింబవళ్లు కష్టపడండి
- జాప్యం చేస్తే.. కఠిన చర్యలు తప్పవు
- ఎప్పటికప్పుడు ఎంబీలు రికార్డు చేయాలి
- పనుల పురోగతిని ప్రతి రోజూ సమీక్షిస్తా
- కలెక్టర్ పమేలా సత్పతి
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష






ప్రజాజ్యోతి కరీంనగర్ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ జూన్ 4వ తేదీ లోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాత్రింబవళ్లు కష్టపడి పనులు చేయించాలని సూచించారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై స్పెషల్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులన్నీ సత్వరమే పూర్తి కావాలని సూచించారు. పనుల్లో జాప్యం జరిగితే ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేగవంతంగా పనులకు


## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు

# అన్ని ఏర్పాట్లు చేయాలి



- పరీక్షకు ముందుగానే అభ్యర్థులు కేంద్రానికి చేరుకోవాలి
- ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్ష కేంద్రాలలో కి అనుమతి లేదు
- జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, మే 29, (ప్రజాజ్యోతి): వచ్చే నెల 9 వ తేదీన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. వచ్చే నెల 9 వ తేదీన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని మినీ మీటింగ్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యా నాయక్ తో కలిసి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉదయం 10.30 గంటల నుండి మధ్యాన్నం 1.00 గంట వరకు కొనసాగే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లాలో 4699 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా నెలకొల్పిన కంట్రోల్



## ప్రజాసేవలో అధికారులు విఫలం కాకూడదు

మొదటిపేజీ తరువాయి..
మాట్లాడుతూ అధికారులు నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం మరికొద్ది రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు విత్తన సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాగు నీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని త్వరలోనే కలికోట సూరమ్మ చెరువుకు సంబందించిన పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. వర్షాకాలంలో మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ కి వెళ్ళే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పాఠశాల ఆవరణలో నీరు ఆగకుండా చర్యలు తీసుకోవాలని మహిళలకు స్వయం ఉపాధిలో భాగంగా కుట్టుమిషన్లు ద్వార ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్ రావు, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు బొడ్డు బాలు, ఎంపిటిసిలు కొండ ఆంజనేయులు, వేముల గంగారాజం, కో ఆప్షన్ రఫీ, ఎంపిటిసిలు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ ప్రవీణ్, ఎమ్మార్వో ముంతాజీబొద్దీన్, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి బోనాల ఉత్సవం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు**



వేములవాడ, మే 29, (ప్రజాజ్యోతి): వేములవాడ పట్టణ పరిధిలోని కొనాయపల్లిలో లక్కామారు మున్నూరు కాపు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ బోనాల మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో సకాలంలో వర్షాలు పడి రైతులు, ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాల పండుగ

జగిత్యాల ప్రతినిధి, మే 29 (ప్రజాజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక భక్తిశ్రద్ధలతో వండి కోరిన మొక్కులు తీర్చే కొంగు బంగారమైన గంగమ్మ తల్లికి జగిత్యాల పట్టణ పురవీధుల్లో ర్యాలీగా వెళ్లి బోనం సమర్పించారు. పట్టణంలోని వాణీ నగర్, బీట్ బజార్, తులసీ నగర్ ప్రాంతాల నుంచి గంగపుత్ర సంఘం మహిళల ఆధ్వర్యంలో ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మహిళలతో ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. డీజే పాటు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లిన మహిళలు గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. బోనాల జాతర కార్యక్రమంలో అదువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని వర్షాలు సంవృద్ధిగా కురువలని గంగమ్మ తల్లిని కోరుకున్నారు. గంగపుత్రుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పాఠశాలల్లో జూన్ 4లోగా పనులన్నీ పూర్తి కావాలి

మొదటిపేజీ తరువాయి..
సంబంధించిన ఎంబీ రికార్డులను పూర్తి చేసి డీఈఓ ఆఫీస్ లో అందజేయాలని సూచించారు. స్వశక్తి మహి ళల భాగస్వామ్యంతో పనులను చేపట్టాలని, వారు ముందుకు రానిచోట వేరే వారితో పనులు పూర్తి చేయించాలని పేర్కొన్నారు. పనులు చేయించిన వారికి మూడు శాతం అడ్విన్ ఛార్జీలు చెల్లించాలని, చేయించాని వారికి చార్జీలు చెల్లించవద్దని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 345 పాఠశాలల్లో పనులు సాగుతున్నాయని వివరించారు. జూన్ 4లోగా పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతిరోజు పనులపై సమీక్ష జరుపుతానని, ఎంబీ రికార్డుల సంబంధించిన సమాచారాన్ని తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పనులపై ఎవరు కూడా నిర్లక్ష్యంగా ఉండవ ద్దని, రాత్రింబవళ్లు పనులు చేయించాలని సూచించారు. పాఠశాలలన్నీ కలరింగ్ తో సహా సిద్ధం చేసి ఉంచాలని పేర్కొన్నారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాల్లో సైతం మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యుత్తు, తాగునీటి సరఫరా ఇతర వసతులు కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని పేర్కొన్నారు. పనులన్నీ వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డీఓ శ్రీధర్, డీఈఓ జనార్దన్ రావు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ శ్రీనివాస్ రావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

మొదటిపేజీ తరువాయి..
రూమ్ 9398684240 నెంబర్ కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

**ముందుగానే చేరుకోవాలి**

పరీక్ష కేంద్రాలలో టేబుల్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రశ్నపత్రాలను పంపిణి మొత్తం సిసి కెమరాల ద్వారా కెమరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు వచ్చే దివ్యంగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు ముందుగానే చేరుకోవాలని, అలస్యం అయిన వారిని పరీక్షకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రంవద్ద మంచినీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా చూడాలని, ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా ముందుగానే సరిచూసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షను వ్రాసే వారితో పాటు ఇన్ విజిలేటర్లకు సైతం అనుమతిలేదని తెలిపారు. ఒక్క చీఫ్ సూపరింటెంట్ వద్ద తప్ప ఎవ్వరి మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ సరఫరా లో ఎలాంటి లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, డీఐఈఓ మోహన్, డీఈఓ రమేష్ కుమార్, డీటీఓ లక్ష్మణ్, సిరిసిల్ల వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

### మండల స్థాయి అధికారులపై
# మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం ఫైర్

గంభీరావుపేట మే 29 (ప్రజా జ్యోతి): రైస్ మిల్లర్లు అధికారులు కుమ్మక్కై క్వింటాలకు 5 కిలోలు దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పలు ఆరోపణలు చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరి దాన్యం అధిక తూకం వేయవద్దని ఆదేశాలిస్తే కొనుగోలు కేంద్రాల సెంటర్ల నిర్వాహకులు అధికారులు రైస్ మిల్లర్ల యాజమాన్యం కుమ్మక్కై క్వింటాలకు 5 కిలోల చొప్పున అధిక తూకం వేసి రైతులను నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. అధిక తూకం వేసిన డబ్బులను వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమయం 12 గంటలు దాటిన తహసిల్దార్ అందుబాటులో ఉండడం లేదని,రిజిస్ట్రేషన్ కొరకు వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూస్తున్నారని,



పలు సర్టిఫికెట్ల కొరకు వచ్చిన ప్రజలు రోజుల తరబడి తిరుగుతున్న జారీ చేయడం లేదని మండిపడ్డారు.గంభీరావుపేటలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని పోలీసులు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై మామూళ్ల మత్తులో అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్నారని, ఇసుకను విచ్చలవిడిగా తియడం వలన భూగర్భ జలాలు అడగంటి పోతున్నాయని ధ్వజమెత్తారు.జిల్లా కలెక్టర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా భాస్కర్ నాయక్ టేకుమళ్ళ రాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విత్తన లభ్యత, సరఫరాపై తగిన చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**

రాజన్న సిరిసిల్ల, మే 29, (ప్రజాజ్యోతి): వానా కాలం ప్రారంభం అయిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ సంచాలకులు విత్తన లభ్యత, సరఫరా గురించి టెలీ కాన్ఫరెన్స్ తీసుకుని సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈ వానా కాలంలో ప్రాధమికంగా పచ్చి రొట్ట పంట అయిన జీలుగ విత్తనాలు 2250 క్వింటా జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. గత సంవత్సరం లో 2200 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు రైతులకు సరఫరా చేశారన్నారు. ఈ సీజన్ లో ఇప్పటికే 1582. 20 క్వింటాళ్ల విత్తనాలు ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు ఙమరియు డి సి ఎమ్ ఎస్ ల ద్వారా సరఫరా చేయడం జరిగిందన్నారు. మన జిల్లా కి కేటాయించిన మిగతా 667.80 క్వింటాళ్ల విత్తనాలు కూడా త్వరగా సరఫరాకు కోరారు. జిల్లాలో పత్తి సాగు గత సంవత్సరం లో 50552 ఎకరాలు సాగు చేయగా, ఈ సంవత్సరంలో 49215 ఎకరాలు సాగు చేస్తారని అంచనాలు వేసి



1,76000 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని విత్తనాలు సరఫరా చేయాలని డీలర్ ల ని ఆదేశించడం జరిగినది. జిల్లాలో ఇప్పటి వరకు 48000 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగింది. 5670 విత్తన ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని రైతుల కి తెలియ చేయునది ఏమనగా, ఏ కంపెనీ బి జి II పత్తి విత్తనాల రకాలు అయినా కూడా దిగుబడిలో వ్యత్యాసం ఉండదు అని తెలియజేశారు. అందరూ రైతులు విధిగా లైసెన్స్ పొందిన డీలర్ దగ్గర మాత్రమే రశీదు పొంది విత్తనాలు కొనాలని, బిల్లులు పంట కాలం మొత్తం భద్ర పరుచు కొని ఉండాలని కోరారు. జిల్లాలో పత్తి విత్తనాల కొరత లేదని పేర్కొన్నారు.

## యువకులు అక్రమ కేసుల్లో బలి కావద్దు

**మంచి భవిష్యత్తు ఎంచుకోవాలి**



గంభీరావుపేట మే 29 (ప్రజా జ్యోతి): గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో పోలీస్ నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్.ఈ సందర్భంగా ప్రజలతో వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలతో మమేకం కావడం, గ్రామ ప్రజల దగ్గరి నుండి వారి అభిప్రాయాలను తీసుకోవడం, ప్రజలు వారి గ్రామంలో ఉన్న సమస్యలు చెప్పుకోవడం జరుగింది అని వాటి పైన త్వరలోనే యాక్షన్ తీసుకోవడం జరుగుతుంది అన్నారు. గ్రామంలో ఉన్న పాత కేసులు, పాత గొడవలు, మొదలగు సమస్యలు చెప్పారని వాటిపైన యాక్షన్ తీసుకుంటామని మా పరిధిలో లేని అంశాలపై కూడా సంబంధిత అధికారులతో మాట్లాడుతం అని అన్నారు. అదేవిధంగా ప్రజలకు రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఉపయోగం, సైబర్ నేరాలు, సోషల్ మీడియా, గల్ఫ్ సమస్యలు, డయల్ 100, షీ టీమ్స్ మొదలగు అంశాల మీద ప్రజలకు అవగాహన కల్పించారు, అదేవిధంగా సోషల్ మీడియాలో అనవసర పోస్ట్ లు పెట్టకూడదని వాట్స్ అప్ గ్రూపు లలో వచ్చే మెసేజ్ లు ఇతరులకు పంపకుడదాని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో పోలీస్ నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న ఆ రోజున వచ్చి సమస్యలను చెప్పుకోవాలని వాటిపైన ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యువత ఎవరు కూడా చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని డ్రగ్స్ గంజాయి స్మోకింగ్ డ్రింకింగ్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సమాజంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని అదే విధంగా ప్రభుత్వం నుండి పెద్ద సంఖ్యలో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తున్నాయని ఎవరు కూడా సమయం వృధా చేసుకోవద్దని. చెడు వ్యాసనాలు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామ్మోహన్ పోలీస్ సిబ్బంది పరిసరం, శ్రీనివాస్, మల్లేశం, గ్రామ, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరకుండా సూచికలు ఏర్పాటు చేయాలి

**రెడ్ క్రాస్ చైర్మన్ పెద్దపల్లి చైర్మన్ కావేరి రాజగోపాల్**




సిరిసిల్ల, మే 29, (ప్రజాజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరకుండా సూచికలు ఏర్పాటు చేయాలని ఆర్‌ఎండి అధికారులకు, పోలీస్ అధికారులకు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం పెద్దపల్లి నుండి కారులో ప్రయాణం చేస్తుండగా సిరిసిల్ల కలెక్టరేట్ జంక్షన్ దగ్గర సరియైన మార్గం సూచికలు లేక తమ వాహనానికి ద్విచక్ర వాహనం ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా సూచికలను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.

## పసి హృదయాలు - హాస్టల్ అనుభవాలు

ప్రొద్దున్నే ముద్దుగా నిద్దుర లేపే అమ్మ నోటి మాట వినబడదు
పొద్దంతా కష్టపడ్డా సాయంకాలం కాస్త సమయమైన నన్ను
ముద్దాడే నాన్న కనబడదు

హాస్టల్ అంటేనే.....
ఆప్యాయత అనురాగాలు తక్కువ
అజమాయిషీ అహంకారాలు ఎక్కువ

మెట్ల మంచాల పై మెత్తటి పరుపులున్న
గాఢ నిద్రలకు లేదు గ్యారంటీ
కట్ల కంచం నిండా కమ్మని కూడు ఉన్నా
కడుపునిండా తినడానికి చేయిరాదు
పేరుకే అవి కిటికీలు వాటిపై
పేరుకుపోయిన సాలీడు గూడు కట్టలు
మెతక వాసనతో మతి చెడిపోయే తడియారని బట్టల గుట్టలు
హాస్టల్ హాల్ లో అటు ఇటు ఎందరో పడుకున్నా
అందరూ ఎవరికి వారే ఒంటరి గా వారి ఇంటి జ్ఞాపకాలతో
అనిపిస్తుంది అలుముకొని పడుకోడానికి
అమ్మ ప్రక్కనుంటే బాగుండు
కాలు పైనేసి కునుకు తీయడానికి
కన్నతండ్రి కాదయే ఆ దిండు
ముసుకేసిన చెద్దరులో శరీరం చమటముద్ద అయినా
చీమదూరే సందు ఉండదు ఆ చీకటి భయానికి
సోయి లేక పడుకుంటే కారిన సొల్లు గీతలన్నా
రాత్రంతా ఏడిస్తే కారి ఎండిన కంటిదారలు ఎన్నో

వేలు పట్టుకొని నడిపించే వయసు నుండే
మంచి చదువుల పేరుతో పసి హృదయాలను జీవితమంతా
చేస్తున్నారు హాస్టల్ పాలు...
అదే ఒంటరితనం అలవాటై కనికరం లేకుండా తల్లిదండ్రు
లకు ఇస్తున్నారు వృద్ధాశ్రమాలు...

తప్పు తల్లిదండ్రులదా....
అందరూ వుండి ఏకాకి గా ఎదిగిన పిల్లలదా....

అందుకే అంటాను....
పది వరకైనా ఉండకూడదు ఇల్లు వదిలి
పై చదువులకు తప్పదేలాగు హాస్టల్ కు బదిలీ
పిన్న వయస్సు నుండే కన్నవారు నేర్పించాలి
మన కుటుంబ వ్యవస్థ గురించి ప్రతీది
ఎవరు అవ్వకూడదు తమ ఇంటికి తాము అతిథి



రచన
హరినాథ్ రాజు
చెన్నమాధవుని
ప్రిన్సిపాల్,
కృష్ణవేణి
టాలెంట్ స్కూల్,
రుద్రంగి..

# మెట్ పల్లి ఖాదీ ఆవరణలో కళావేదికను నిర్మించాలి

మెట్ పల్లి ప్రతినిధి మే 29 (ప్రజా జ్యోతి) : మెట్ పల్లి ఖాది గ్రామోద్యోగ భండార్ ఆవరణలో కళావేదికను నిర్మించాలని వివిధ కళాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సంబంధిత అధికారులను, నాయకులను పత్రిక ప్రకటన ద్వారా కోరారు.. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ఖాది గ్రామోద్యోగ సంస్థ ఏర్పడినప్పుడు ఖాదీ ఆవరణలో నిర్మింపబడిన కళావేదిక దశాబ్దాల కాలంగా ఖాదీ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన సాంస్కృతిక కార్యక్రమాలకు, నవరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు, మెట్ పల్లి క్లబ్ ద్వారా నాటిక, నాటక ప్రదర్శనలకు, లలితకళాసమితి కార్యక్రమాలకు, మన మెట్ పల్లి పాత తాలుక పరిధిలోని జానపద , సాంఘిక, పౌరాణిక ప్రదర్శనలకు, శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలకు నిలయమైందన్నారు. మెట్ పల్లి పట్టణ కీర్తిని, కళారంగ వైభవాన్ని



నాలుగు దిశల వ్యాప్తికి ఆధారమైన, కేంద్రబిందువైన "ఖాదీ కళావేదిక " ను తొలగించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రముఖులు, కళాభిమానులు, కళాపోశకులు, కళాహృదయులు, పాత్రికేయులు, కవులు, గాయకులు, రంగస్థల కళాకారులు అందరు కూడ ఖాదీ ఆవరణలో మళ్ళీ యధావిధిగా 'కళావేదిక తో కూడిన కళాప్రాంగణాన్ని నిర్మించాలని ఆకాంక్షిస్తున్నారన్నారు . సంబంధిత అధికారులు, నాయకులు అందరి ఆకాంక్షను పరిగణలోకి తీసుకొని కళాప్రాంగణాన్ని నిర్మించి భవిష్యత్ తరాలకు, మెట్ పల్లి కళావేదికను సాంస్కృతిక కళా వారసత్వ వేదికగా అందివ్వగలరని విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో వివిధ కళాసంఘాలకు చెందిన ప్రతినిధులు కోటగిరి వెంకటస్వామి, మట్టెలగంగాధర్, పరాంకుశం నర్సయ్య, ఎండీ. సాబీర్ హుస్సేన్, ఎలిగేటి కృష్ణ, గంగశ్రీనివాస్, అందె మారుతి, కోటగిరి చైతన్య, ఇల్లెందుల కృష్ణమాచారి, రంగు శ్రీనివాస్, మద్రి భాస్కర్, బెజ్జరపు భూమయ్య, క్రాంతికుమార్, కె.దశరథం, టి. జగదీశ్వర్, ఎస్. రవీందర్, అనంతం, ఒడ్డం శ్రీనివాస్, అందె భవిత రాణి, సొప్పరి శ్రీనివాస్, బోడ ఎలీషా, పి. శ్రీకాంత్, పి. లింగారెడ్డి, టి. గంగాధర్, టి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం

ముస్తాబాద్ మే 29(ప్రజాజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం రామలక్ష్మణ పల్లె గ్రామంలో గత మూడురోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి రేకులు ఎగిరి పోవడంతో మూడు కుటుంబాలు గూడును కోల్పోయాయని గూడెం వాస్తవ్యులు చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు దంపతులకు తెలుపగానే బోయిని



ఎల్లం,బోయిని లచ్చవ్వ,ఉబిది మల్లయ్య కుటుంబాలకు ఒక్కరికి 10,000 చొప్పున ముగ్గురికి ఆర్థిక సాయం అందించారు.ఆ నిరుపేద కుటుంబాలు మరియు రామలక్ష్మణ పల్లె మాజీ సర్పంచ్ దమ్మ రవీందర్ రెడ్డి మరియు గ్రామస్తులు మాధవి వెంకటేశ్వర్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

## హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర



వేములవాడ, మే 29, (ప్రజాజ్యోతి): జూన్ 1వ తేదీన జరగబోయే పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేములవాడ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నేడు గురువారం రోజున హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వరాలయం నుండి మొదలై పట్టణ పుర వీధుల గుండా ఈ శోభాయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి పట్టణ ప్రజలు, హనుమాన్ దీక్షాపరులు అందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

## నాయకుడిపై అభిమానం చాటుకున్న యువ నాయకుడు

సుల్తానాబాద్ మే 29 (ప్రజా జ్యోతి) పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతకుంట విజయ రమణారావు గెలుపొందితే కాలినడకన కొండగట్టు అంజన్న దర్శనం చేసుకుంటానని మొక్కుమొక్కిన సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం అనిల్ కుమార్ గౌడ్ అనే యువకుడు తన మొక్కు తీర్చుకునేందుకు తొగర్రాయి గ్రామం నుండి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు కాలినడకన వెళ్లాడు. తన అభిమాన నాయకుడు చింతకుంట విజయ రమణారావు గెలుపొందిన సందర్భంగా తన మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. అంజన్న స్వామి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రత్యేకంగా వేడుకున్నానని అన్నారు.



## గ్యాస్ ఏజెన్సీ నీ ఆకస్మికంగా తనిఖీ



పెద్దపల్లి ప్రతినిధి ,(ప్రజా జ్యోతి), మే 29: డి.సి.ఎస్. ఓ. పెద్దపల్లి, వారి ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది నమ్మదగిన సమాచారం మేరకు రామగుండం మండలం గోదావరిఖని శివాజీనగర్ లోని రవి తేజ హెచ్.పి. గ్యాస్ ఏజెన్సీ నీ ఆకస్మికంగా తనిఖీ చేయగా, అందులో రికార్డ్స్ సరిగా మెయింటెయిన్ చేయనందున, వ్యత్యాసం ఉన్నందున కేసు నమోదు చేసినట్లు డి.సి.ఎస్. ఓ. ప్రేమ్ కుమార్ తెలిపారు.

## ఖురాన్‌ను అవమానించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

**సున్నీ మర్కజి మీలాద్ కమిటీ అధ్యక్షుడు హఫీజ్ యూసుఫ్**



కరీంనగర్, మే 29 ప్రజా జ్యోతి: ఇటీవల ముస్లింలు పవిత్ర ఖురాన్‌ను ఒక వ్యక్తి అవమానిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కరీంనగర్ జిల్లా సున్నీ మర్కజి మిలాద్ కమిటీ అధ్యక్షుడు హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ యూసుఫ్ మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎక్స్ ముస్లిం సమీర్ అనే సోషల్ మీడియాలో అకౌంట్ సృష్టించి..ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను అవమానిస్తున్నట్లు వీడియో వైరల్ అవుతుందని, అందులో తాను ఖురాన్‌ను అవమానిస్తున్నట్లు ఉందని ఆయన తన ప్రకటనలో తెలిపారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింల హృదయాలను గాయపరిచే చర్య అని అన్నారు. ముస్లింల హృదయాలను గాయపరిచిన ఇలాంటి సిగ్గులేని వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అన్నారు. అన్ని మతాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే ఆ పిచ్చివాడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి నీచమైన పనులు చేయరని అన్నారు. దేశ వాతావరణం చెడిపోకుండా ముస్లింలందరూ సహనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చట్టాలపై మరింత అవగాహన అవసరం

**(జూనియర్ సివిల్ జడ్జి శ్యాం ప్రసాద్**



జగిత్యాల ప్రతినిధి, మే 29 (ప్రజాజ్యోతి) : ప్రజలు చట్టాలపై, భారత రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని, మరింత చైతన్యవంతులు కావాలని ధర్మపురి కోర్ట్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాం ప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చెక్కల్ల గ్రామంలో బుధవారం ప్రజలతో చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జ్ శ్యాం ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ ప్రజలకు వివిధ చట్టాల గురించి, సెక్షన్ల గురించి, నేరాలపై పడే శిక్షల గురించి, భారత రాజ్యాంగం పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. చట్టాలు తెలిస్తే ఎలాంటి నేరాలు జరగవని వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రౌతు రాజేష్, వైస్ ప్రెసిడెంట్ రామడుగు రాజేష్, జాయింట్ సెక్రెటరీ మామిడాల శ్రీకాంత్, ట్రెజరర్ జాజాల రమేష్, స్పోర్ట్స్ సెక్రటరీ బత్తిని ఇంద్రకరణ్, గజ్జల రాజు, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ పంచాయతీ సెక్రెటరీ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సి 2020 ఎరియర్స్ బిల్స్ ఎన్నిసార్లు సమర్పించాలో!



ప్రజాజ్యోతి,కరీంనగర్: గత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు 2018 లో ప్రకటించవలసిన వేతన సవరణను అట్టహాసంగా ఉద్యోగులకు ఎంతో గొప్ప పిఆర్సి ఇస్తున్నామని రెండు సంవత్సరాలు ఆలస్యంగా 2020 ప్రకటిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు 51, 2021 మే నెలలో ప్రకటించారు. దాని ప్రకారం ఉద్యోగులకు వేతన సవరణ చేయవలసి ఉన్నది. అందులో భాగంగా పిఆర్సి ఏరియర్స్ 1.4.2021నుండి 31.5.2021 రెండు నెలల ఏరియర్స్ ను నగదు చెల్లిస్తామని ఉత్తర్వులు ఇచ్చారు.ఆ ఉత్తరువు ప్రకారము 18 వాయిదాల బిల్లులను స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని అందరూ ఉపాధ్యాయుల, ఉద్యోగుల బిల్లులు తయారుచేసి 2022లో ఎస్ టి ఓ కార్యాలయాల్లో సబ్మిట్ చేశారు. ఆనాటి నుండి ఫైనాన్షియల్ ఇయర్ మార్చి 2023 వరకు బిల్లులు చెల్లింపులు కాక ఆ బిల్లులను రిజెక్ట్ చేశారు. స్కూల్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని, హై స్కూల్ స్థాయిలోని సుమారు 60 మంది ఉపాధ్యాయుల బిల్లులు తిరిగి మళ్లీ చేసి చెల్లింపులకు ఎస్ టి ఓ కు సబ్మిట్ చేశారు. మార్చి 2024 ఫైనాన్షియల్ సంవత్సరము వరకు మళ్లీ చెల్లింపులు చేయక ఆ బిల్లులన్నింటినీ మళ్ళీ రిజెక్ట్ చేశారు. రెండు నెలల ఏరియర్స్కు మూడుసార్లు బిల్లులు చేసిన ఫలితం లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆ బిల్లులను వెంటనే రీజనరేట్ చేస్తూ చెల్లింపులు చేయాలని రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జాలి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణం పనులను

**పరిశీలించిజిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్**



శంకరపట్నం, మే 29 (ప్రజా జ్యోతి) మండల పరిధిలో అదనపు ప్రఫుల్ దేశాయ్ బుధవారం నాడు ఆకస్మిక తనిఖీ అంబాల పూర్ ప్రాథమిక స్కూల్ ను సందర్శించి సకాలంలో పనులు పూర్తి చేయుటకు కాంట్రాక్టర్లు ఆదేశించినారు వెంట జిల్లా విద్యాశాఖ అధికారిఎంపీడీఓ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీరాజ్ ఎంపీఓ AE PR హెడ్మాస్టర్ VO అధ్యక్షురాలు అంబాల్ పూర్ పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు



బీరుపూర్, మే 29 ( ప్రజాజ్యోతి) : బీరుపూర్ మండలం లోని తుంగూర్ చిత్రవే జిగూడెం తదితర గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లైసెన్స్ ఉన్న షాప్ ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులు రశీదులు తప్పకుండ తీసుకోవాలని సూచించారు. విత్తనాల బ్యాగులపై గడువు తేదీలను గమనించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ అనూష, ఏఈఓలు సందీప్, శిరీష రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

కథలాపూర్, మే 29(ప్రజాజ్యోతి): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన మ్యాదరవేని సంజన, మ్యాదరి బాబు, కథలాపూర్ కేంద్రానికి చెందిన కాశీం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, అజీమ్, తొట్ల అంజయ్య, వేలిచాల సత్యనారాయణ, రేహాన్ తదితరులు ఉన్నారు.

# మానేరు పరివాహ ప్రాంతాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిది

**సహజ వనరులను పరిరక్షించుకుందాం.**
**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి**



సుల్తానాబాద్ మే 29 (ప్రజా జ్యోతి) మానేరు పరివాహక ప్రాంతమును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టెముక్కుల సురేష్ రెడ్డి అన్నారు. పెద్దపెల్లి జిల్లాలో ఇసుక రీచ్ ల పేరుతో మానేరు విధ్వంసాన్ని అక్రమ తవ్వకాలను అక్రమ రవాణా గురించి సురేష్ రెడ్డి పోరాటం చేస్తూ వాటిని నిలిపివేయాలని చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేసి విజయం సాధించినే సందర్భంగా సురేష్ రెడ్డిని సుల్తానాబాద్ మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు మంగళవారం ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపెల్లి నియోజకవర్గం సహజ వనరుల సంపదతో కూడుకున్నదని ఇలాంటి సహజ వనరులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం రాష్ట్రంలో లేదని ఈ సహజవానలను భవిష్యత్ తరాల వారి కోసం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మానేరు వాగులో ఇసుక రీచ్ ల పేరుతో గత పాలకులు విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తూ వందల లారీ లకొద్దీ అక్రమంగా రవాణా చేస్తూ కోట్లాది రూపాయలను అక్రమంగా ఆర్జించారని అన్నారు, జీవనోపాధి కోసం మానేరు పరివాహ ప్రాంత గ్రామాల యువత ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తే అధికారులు ట్రాక్టర్లు పట్టుకొని 5000 జరిమానా అంటూ ట్రాక్టర్లు సీజేస్తామంటూ బెదిరించారని కానీ వారి కళ్ళముందే నిత్యం వందలాది లారీలు వెళ్తుంటే వాటిని వదిలేసారని దగ్గరుండి పంపించాలని అన్నారు ఇసుక రీచ్ పేరుతో జరిగిన మానేరు విధ్వంసం పెద్ద ఎత్తున ఇసుక తరలింపుతో భవిష్యత్తులో ఈ ప్రాంతంలో తాగు సాగునీటి కొరత తలెత్తబోతుందని వాటిని నివారించేందుకు రైతుల ప్రయోజనం కోసం తాను ఇలాంటి ప్రలోభాలకు లోగకుండా పోరాడి రైతులకు అనుకూలంగా న్యాయాన్ని తీసుకువచ్చానని అన్నారు, భవిష్యత్తులో కూడా మానేరు వాగులు రక్షించుకోవడానికి అందరూ తనకు అండగా నిలవాలని కోరారు అనంతరం వివిధ గ్రామాలకు చెందిన రైతులు యువకులు సురేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజి జెడ్పిటిసి గుర్రాల మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, వేల్పుల రాజన్న పటేల్, కూకట్ల నాగరాజు, ఇగురం రామస్వామి, వడ్లకొండ మహేష్, సంతోష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు కే తిరుపతి రెడ్డి**




జమ్మికుంట,మే29( ప్రజా జ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హుజురాబాద్ డివిజన్ కమిటీ అధ్యక్షులు సొదమల్ల యోహాన్ అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యంగా హెల్త్ కార్డు, నివేషన స్థలాలు, రైల్వే పాసులను పునరుద్ధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫోర్త్ స్టేట్ అని చెప్పుకునే జర్నలిస్టులకే రక్షణ లేకుండా పోతుందని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేసే కలం కార్మికులకు గుర్తింపు లేకుండా పోతుందని అన్నారు.అనంతరం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి టిడబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తుందని అన్నారు.ఈ సమావేశంలో హుజురాబాద్ డివిజన్ కమిటీ అధ్యక్షులు సొదమల్ల యోహాన్, ప్రధాన కార్యదర్శి అయిత రాదా కృష్ణ, భూపతి సంతోష్, అరికెళ్ల భానుచందర్ ఏబుసి సంపత్, సుధాకర్, ఖాజా ఖాన్,కొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు..

## జూన్ 3 లోపు పద్మ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అక్కపాక సురేష్**

పెద్దపల్లి ప్రతినిధి,(ప్రజా జ్యోతి), మే -29: జూన్ 3 లోపు పద్మ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అక్కపాక సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేసిన వ్యక్తుల నుంచి పద్మ పురస్కారాల కోసం జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయం పెద్దపెల్లి జిల్లా వారు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆర్ట్ ,సాహిత్యం,విద్య,క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ప్రజా వ్యవహారాలు, పౌర సేవ, వాణిజ్య పరిశ్రమలు తదితర వాటిలో చేసిన కృషిని, సాధించిన లక్ష్యాలను 800 పదాలు మించకుండా https//padmaawards.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తును చేసుకోవాలని అన్నారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో 4 సెట్స్ లను జూన్ 3వ తేదీలోగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని రూం నెంబర్ 225 జిల్లా యువజన క్రీడా శాఖ వారి కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు http//padmaawards.gov.in వెబ్ సైట్ ని సందర్శించాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## వానాకాలం విత్తనాల కొనుగోలుపై రైతులకి అవగాహన



రుద్రంగి మే 29 ప్రజా జ్యోతి: రుద్రంగి మండలంలోని దెగావత్ తాండ, అడ్డబోర్ తండా గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారి ఆధ్వర్యంలో బుధవారం రైతులకి విత్తనాల కొనుగోలు పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతులకు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సినజాగ్రత్తల గురించి తెలిపారు. లూజుగా ఉన్న సంచులలో గల విత్తనాలను కొనుగోలు చేయరాదని,రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు.విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యేవరకు భద్రంగా దాచుకోవాలని, వ్యవసాయ శాఖ తరుపున గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.కొనుగోలు రశీదు మీద విత్తన కంపెనీ పేరు, రకం, బ్యాచ్ నెంబరు, ప్లాట్ నెంబర్, తయారీ తేది, ముగింపు తేదీ మొదలగునవి ఉన్నాయా లేదా సరిచూసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మానాల క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్, గ్రామ రైతులు బానోత్ రాజు, రమేష్, దశరథ్, నర్సింగ్, రాజు మరియు రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారులు ఏగోలపు జ్యోషిక , ఏగోలపు కౌశిక్ లకు బంగారు నంది అవార్డు



సుల్తానాబాద్ మే 29 (ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ కరోన విపత్కర సమయంలో చేసిన సేవాకార్యక్రమాలగాను పుట్టినరోజు వేడుకలు, డిసెంబర్ 31 వేడుకలు వద్దని చేస్తున్న ఛాలెంజ్ ప్రోగ్రాం లకు గాను చిన్నారులు ఏగోలపు జ్యోషిక , ఏగోలపు కౌశిక్ లకు బంగారు నంది అవార్డు - 2024 ఇందిర ఫౌండేషన్ అధ్యక్షురాలు డా ఎన్ ఇందిర, ప్రధాన కార్యదర్శి డా"ఆలూరి విల్సన్ గార్ల ఆధ్వర్యంలో ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతి లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా సినీ నటులు, దర్శకులు నిర్మాత పంజాల జైహింద్ గౌడ్,ప్రముఖ దర్శకుడు ఎస్ వి కృష్ణారెడ్డి,ప్రముఖ నిర్మాత కె అచ్చిరెడ్డి, సినిమా నటులు చింతకుంట రామ్ మానిక్, జబర్దస్త్ ఆర్టిస్ట్ సునామీ సుధాకర్, సద్దాం హుస్సేన్,చిక్కడపల్లి సి ఐ ఏ. సీతయ్య,కళావేదిక పత్రిక ఎడిటర్ రాయవరపు భువన, దర్శిని సినిమా హీరోయిన్ దర్శిని చేతుల మీదుగా ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ వారు ఏగోలపు జ్యోషిక ,ఏగోలపు కౌశిక్ లకు బంగారు నంది అవార్డు - 2024 అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారులు జ్యోషిక, కౌశిక్ లు మాట్లాడుతూ కరోన విపత్కర సమయంలో చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎన్ ఇందిర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆలూరి విల్సన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



కోరుట్ల మే 29 ప్రజా జ్యోతి: లైన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల మరియు, లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవ దుర్గ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం జోన్ చైర్మన్ లయన్ అల్లాడి శోభ ప్రవీణ్ సౌజన్యంతో స్థానిక వాసవి కళ్యాణ భవనం లో నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 108 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు.వారికి సుమారు 60 వేల రూపాయల వివిధ రకాల మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు అనుప్ రావు, దిలీప్ రావు, రేగొండ రాజేష్, అన్వేష్, స్వీతి, ప్రియాంక శృతి నరేష్ లు సేవలందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వనపర్తి రమ్య చంద్ర మోహన్ , కుందారపు ప్రేమలత మహేందర్ , కోశాధికారి కొండబత్తిని రాధిక కృష్ణ ప్రసాద్ , పోతని ప్రవీణ్, ఆడెపు మధు, మంచాల జగన్ తదితరులు పాల్గొన్నారు.